క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్

మద్యం సీసాల తొలగింపు

నమస్తే ఎఫెక్ట్

ఇబ్రహీంపట్నం, మార్చి 24 : 'మద్యం ప్రియులకు అడ్డాగా మారిన క్రీడా ప్రాంగణం' అనే శీర్షికతో సోమవారం నమస్తే తెలంగాణాలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిధలోని ముకునూరు గ్రామపంచాయతీ క్రీడా ప్రాంగణంలో క్రీడలకు బదులుగా మద్యం ప్రియులు అడ్డాగా మలుచుకుని ఖాళీ సీసాలు పగులగొట్టడం వంటి పనులు చేస్తున్నారు. దీంతో నమస్తే తెలంగాణాలో వచ్చిన వార్తకు మండల స్థాయి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. క్రీడా ప్రాంగణం ఆవరణలో మద్యం సేవిస్తే జరిమానా విధిస్తామని, త్వరలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ తదితరులు

సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు

కడ్తాల్, మార్చి 24 : సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజా చౌక్ వద్ద తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక-వివేకానంద యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా చలివేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన యువజన సంఘాల సభ్యులను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, నాయకులున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు

సర్దార్‌నగర్‌లో ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కాంతారెడ్డి

షాబాద్, మార్చి 24 : నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని షాబాద్ సీఐ కాంతారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. లైసెన్సులు లేకుండా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సహించేదిలేదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీలు చేపట్టి వాహనదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. 18 ఏండ్లు నిండని చిన్నారులు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంలాల్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

పాపిరెడ్డిగూడలో స్వచ్ఛ భారత్

పాపిరెడ్డిగూడ జడ్పీహెచ్‌ఎస్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల క్యాంపు

కేశంపేట, మార్చి 24 : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల షాద్‌నగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమం మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ప్లాస్టిక్ రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించడంతోపాటు వాడి పడేసిన వ్యర్థాలతో తయారు చేసిన పలు డిజైన్లను ప్రదర్శించారు. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని ప్రజలు, విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పేపర్ బ్యాగుల వాడకాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీతాపొలె, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్లు, కార్యదర్శి రాఘవేందర్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో సర్కార్ విఫలం

ఛలో హైదరాబాద్ ధర్నాకు వెళ్తున్న ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్

కడ్తాల్ : పోలీస్‌స్టేషన్ ఎదుట ఆశా వర్కర్లతో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య

కడ్తాల్, మార్చి 24 : ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య విమర్శించారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఛలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న తలకొండపల్లి మండలానికి చెందిన ఆశా వర్కర్లను సోమవారం ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఆశా వర్కర్లను పరామర్శించి నిరసన తెలిపారు. రేవంత్ సర్కార్ ఏర్పడి 14 నెలల కావొస్తున్నా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు వేతనాన్ని రూ.18 వేలకు పెంచడంతోపాటు ఈఎస్ఐ పీఎఫ్ సదుపాయాలను అందించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా ధర్నాకు చేయడానికి వెళ్తున్న మహిళలను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దారుణమని విమర్శించారు. ఆశా వర్కర్ల హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శిరీష పాల్గొన్నారు.

షాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్టయిన ఆశావర్కర్లు

ప్రజాపాలనని చెప్పకోవడం సిగ్గుచేటు

షాబాద్ : కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలన ప్రభుత్వమని చెప్పుకోవడం సిగ్గుచేటని సీఐటీయూ షాబాద్ మండల నాయకుడు శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశావర్కర్లను షాబాద్‌లో పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

కేశంపేటలో ముందస్తు అరెస్టులు

కేశంపేట : అసెంబ్లీని ముట్టడిస్తారన్న అనుమానంతో కేశంపేట మండలంలో పోలీసులు సోమవారం వీఆర్ఏలతోపాటు ఆశా వర్కర్లను ఎక్కడికక్కడ ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏల జేఏసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆశ వర్కర్ల సంఘం నాయకురాలు సరస్వతి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తమ నిరసన తెలిపేందుకు వెళితే అనుమతించకుండా అక్రమంగా అరెస్టులు చేసి స్టేషన్‌లో పెట్టడం బాధాకరమన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా వీఆర్ఏల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం జీవో నం.81, 85లను జారీ చేసిందని, కానీ ఆయా జీవోలను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలేదన్నారు. పే స్కేల్ ఇచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రూ.10500 గౌరవ వేతనమే వస్తుందన్నారు. వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని, ఆశా వర్కర్లకు వేతనాలు పెంచడంతోపాటు హెల్త్ బెనిఫిట్స్ కల్పించాలని వారు కోరారు.

కేశంపేటలో ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కనీస వేతనం ఇచ్చే వరకు ఉద్యమం ఆగదు

కొత్తూరు : ఆశల కనీస వేతనం రూ.18 వేలు ఇచ్చేవరకు ఉద్యమం ఆగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా అన్నారు. కనీసం వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని కోరి కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు వెళ్తున్న ఆశలను కొత్తూరు పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

కొత్తూరు : ఆశలను అరెస్టు చేసిన కొత్తూరు పోలీసులు

కాంగ్రెస్ నేతలవి అవగాహనలేని మాటలు

మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతల ఆగ్రహం


మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

కొందుర్గు, మార్చి 24 : లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు విషయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు కాంగ్రెస్ నేతలు అవగాహనలేని మాటలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ చౌదరిగూడ మండల అధ్యక్షులు సయ్యద్ హఫీజ్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు తామే అంకురార్పణ చేశామన్న రీతిలో కాంగ్రెస్ నేతలు మాట్లాడడంపై సోమవారం మండలంలో బీఆర్ఎస్ నేతలు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి కాంగ్రెస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు లక్ష్మీదేవిపల్లి ఈ ప్రాంతంలో నిర్మిస్తే ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలు సస్యశ్యామలం అవుతాయన్న విషయాన్ని మొదట గుర్తించి ఇంజినీర్లకు చెప్పిందే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. లక్ష్మీదేవిపల్లికి నీళ్లు రావాలంటే కృష్ణానది ద్వారా ఎత్తిపోసి నీళ్లు తీసుకురావాలనే కనీస పరిజ్ఞానం కాంగ్రెస్ నేతలకు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎత్తిపోతల ప్రాజెక్టు కింద నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్ అక్కడి నుంచి షాద్‌నగర్ నియోజకవర్గానికి నీరు రావాలన్నారు. ఉదండాపూర్ 90 శాతం పనులు పూర్తయ్యాయని, నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు నీళ్లు కాలువల ద్వారా విడుదల చేసేందుకు రూ.5వేలకోట్ల పైచిలుకు నిధులు సైతం మంజూరయ్యాయన్నారు. రంగారెడ్డి-పాలమూరు అని పేరు పెట్టిందే కేసీఆర్ అనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. కాంగ్రెస్ నేతల ప్రగల్భాలు, పచ్చి అబద్ధాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

మండల పరిధిలోని ఇర్విన్ గ్రామంలో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇర్విన్ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, రెడ్డిపురం గ్రామానికి చెందిన డ్రైవర్ కాసు జోజి.. జేసీబీ, రెడ్డిపురం గ్రామానికి చెందిన డ్రైవర్ కాసు నవీన్ రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. - మాడ్గుల, మార్చి 24

హామీలు నెరవేర్చాలి

కేశంపేట, మార్చి 24 : ఎన్నికల సమయంలో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కేశంపేట మండలం నుంచి ధర్నా చౌక్‌కు మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా నాయకురాలు అలివేలు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు గ్యాస్ సిలిండర్‌తోపాటు గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.3వేలను పెంచి కనీస వేతనంగా రూ.10వేలు ఇస్తామని చెప్పారని, ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. వేసవి సెలవులు సమీపిస్తున్నాయని, పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ చెల్లించాలని, ప్రతి నెల మొదటివారంలో తప్పనిసరిగా బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ధర్నా చౌక్‌కు తరలిన మధ్యాహ్న భోజన కార్మికులు

అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నేతలు రూ.11వేల ఆర్థిక సహాయం అందజేసిన సంఘటన గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన చంద్రమ్మ(55) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్‌లు కామ్లెకార్ నవీన్‌కుమార్ రూ.5వేలు, జగదీశ్వర్ రూ.6వేలను అందజేశారు. - కేశంపేట, మార్చి 24

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 24 : క్షయ వ్యాధిపి నిర్మూలిద్దామని హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా సోమవారం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజజ క్షయ వ్యాధి బారినపడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలను పాటించాలన్నారు. ముఖ్యంగా క్షయ వ్యాధిగ్రస్తులు పోషకాహారం తీసుకోవడంతోపాటు మందులను వాడాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణతో పాటు మందులను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతి రోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షయ వ్యాధి బారిన పడిన వారికి ప్రభుత్వం ఉచిత మందులను అందించడంతోపాటు పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 వారి ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తాజుద్దీన్, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలత, హెడ్ నర్స్ భారతమ్మ, స్టాఫ్ నర్స్ వినీత, హెల్త్ సూపర్‌వైజర్ సువర్ణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ఆరుట్లలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

మంచాల, మార్చి 24 : ఈ నెల 28న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న కూరగాయల మార్కెట్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

కేశంపేట జడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేసేందుకు వెళుతున్న తహసీల్దార్

కేశంపేట, మార్చి 24 : కేశంపేట జడ్పీహెచ్ఎస్, వశిష్ఠ, కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లో సోమవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 548 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. కేశంపేటలోని పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ మీర్ ఆజంఅలీతోపాటు కేశంపేట ఎస్ఐ రాజ్‌కుమార్ తనిఖీ చేశారు.

28న కడ్తాల్ తైబజారుకు వేలం పాట

కడ్తాల్, మార్చి 24 : కడ్తాల్ తైబజారుకు 2025-26కి సంబంధించిన వేలం పాటను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు మండల పంచాయతీ అధికారి లాలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు గ్రామ పంచాయతీలో రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని, జీపీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని తెలిపారు. వేలం పాట కనిష్ట ధరను రూ.9,07,750 లక్షలుగా నిర్ణయించడం జరిగిందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. డిపాజిట్ చెల్లించినవారు శుక్రవారం ఉదయం 11 గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకోవాలని ఆయన వివరించారు.

బస్సు సర్వీసులు నడపండి


బండ్లగూడ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 24 : మున్సిపాలిటీ పరిధి పసుమాముల, కుంట్లూరు, తట్టిఅన్నారం, బండ్లగూడ డిపో మీదుగా జూబ్లీ బస్‌స్టేషన్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని నాయకులు శ్రీకాంత్, చరణ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం బండ్లగూడ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. పెద్దఅంబర్‌పేట నుంచి కుంట్లూరు మీదుగా తట్టిఅన్నారం, బండ్లగూడ డిపో, నాగోల్, దిల్‌షుఖ్‌నగర్‌కు కొత్తగా బస్సు సర్వీసును నడపాలని విన్నవించారు. మరోవైపు, గతంలో జీఎస్ఐ, మన్సూరాబాద్, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ వరకు, అదేవిధంగా జీఎస్ఐ నుంచి బండ్లగూడ, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్ వరకు నడిపిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు.

తప్పిపోయిన కూతుర్ని తల్లిదండ్రులకు అప్పగింత

తల్లిదండ్రులకు పాపను అప్పగిస్తున్న పోలీసులు

మొయినాబాద్, మార్చి 24: కూరగాయల సంతలో అదృశ్యమైన కూతుర్ని పోలీసులు గంటలో వెతికి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోని సోమవారం సంతలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ తన కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం మొయినాబాద్‌కు వలస వచ్చి చిలుకూరు గ్రామంలో నివాసం ఉంటున్నారు. కూరగాయల కోసం తల్లిదండ్రులు పసిపాపను తీసుకుని సంతకు వచ్చారు. వారు సంతలో పాపని దింపి కూరగాయలు కొనుగోలు చేస్తుండగా కూతురు తప్పిపోయింది. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే సంతలో ఉన్న క్రైమ్ టీం సంతలో పాప కోసం గాలింపు చర్యలు చేపట్టి పాప ఆచూకిని గంటలో కనిపెట్టి పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. పాపను అప్పగించడంతో తల్లిదండ్రులు పోలీసులకు ప్రత్యేక అభినందనలు చెప్పారు.

గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శిగా రేనట్ల దర్శన్‌గౌడ్ నియామకం

మొయినాబాద్, మార్చి 24 : గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శిగా రేనట్ల దర్శన్‌గౌడ్ నియమితులైనారు. సమితి జాతీయ అధ్యక్షుడు కృష్ణగౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ దర్శన్‌గౌడ్‌కు హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు.

పంటల పరిశీలన

మాడ్గుల, మార్చి 24 : మండల పరిధిలోని శనివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడటంతో సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా సహాయక చర్యలు చేపడుతామని అన్నారు. మండలంలోని 350 ఎకరాల్లో వరి, మక్కజొన్న, జొన్న, సజ్జ పంటలు నేలకొరిగినట్లు తెలిపారు. 165 మంది రైతులకు నష్టం జరిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్లటౌన్, మార్చి 24 : చేవెళ్లలోని సర్వే నం.75లో గుడిసెలు వేసుకున్న పేదవారికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సీపీఐ నాయకులు ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని సర్వే నం.75కు సంబంధించి ప్రభుత్వ భూమిలో గత రెండు సంవత్సరాల నుంచి ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. వారికి తాగునీరు, కరెంటు సౌకర్యం మొదలగు మౌలిక వసతులు కల్పించి, అర్హులైన పేదవారికి ఇండ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ చేవెళ్ల సభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అధ్యక్షుడు అంజయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మక్బూల్, గీత పనివారల సంఘం మండల కార్యదర్శి కృష్ణగౌడ్, నాయకులున్నారు.


ఇండ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే యాదయ్యకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

డీఎస్పీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

ఆమనగల్లు, మార్చి 24 : డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ)తోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఆ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వంకేశ్వరం రమేశ్ అన్నారు. డీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ఏప్రిల్ 14న చేపట్టనున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర కరపత్రాలను సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట రమేశ్ స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమై 3 సంవత్సరాల 3 నెలల పాటు కొనసాగి హైదరాబాద్‌లో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమినుంచి వెంచర్‌కు రోడ్డు

కలెక్టర్‌కు గౌరెల్లివాసుల వినతి

పెద్దఅంబర్‌పేట, మార్చి 24 : మున్సిపాలిటీ పరిధి గౌరెల్లి గ్రామంలో లెగసీ ఏఎంఆర్ సంస్థ నిర్మిస్తున్న విల్లాల కోసం సర్వే నం.238లో ప్రభుత్వ భూమి నుంచి రోడ్డు వేస్తున్నారని మాజీ సర్పంచ్ తుడుము మల్లేశ్ అన్నారు. ఈ మేరకు రోడ్డు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని రక్షించాలని సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. విల్లాలకు వేరే చోట దారి ఉన్నా.. ప్రభుత్వ భూమి నుంచే రోడ్డు వేస్తున్నారని తెలిపారు. లేఅవుట్‌లో ఓ రోడ్డు చూపించి, మరోచోట రహదారి నిర్మిస్తుండటంతో విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నదని చెప్పారు. పక్కనే బఫర్ జోన్ ఉన్నా.. నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.